
ఆదివారం । 17 । ఆగస్టు । 2025



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



టమాట కిలో రూ.42

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.42 పలికింది. కనిష్టం రూ.32, సరాసరి రూ.24 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.5°/21.6°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా వర్షం కురిసింది. పశ్చిమ దిశగా గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

రేపు కలెక్టరేట్‌లో 'పరిష్కార వేదిక'



అనంతపురం అర్బన్: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని ఈనెల 18న కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూభవన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో అధికారులకు సమర్పించాలన్నారు. అర్జీతో పాటు ఫోన్, ఆధార్ నంబర్లు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే దానికి సంబంధించి రసీదు తీసుకురావాలన్నారు. సమర్పించిన అర్జీల స్థితి గురించి కాల్‌సెంటర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ప్రజలు తమ అర్జీలను పరిష్కార వేదిక ద్వారానే కాకుండా meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లోనూ సమర్పించవచ్చని తెలియజేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తిరుపతి-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: మూడు రోజులు వరుస సెలవులు రావడంతో ప్రయాణికుల రద్దీ దృష్టిలో పెట్టుకుని 17,18వ తేదీల్లో తిరుపతి-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు సీనియర్ డీసీఎం మనోజ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి జంక్షన్‌లో రైలు (07097) ఆదివారం (నేడు) రాత్రి 9.10 గంటలకు బయలుదేరి సోమవారం ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్ చేరుతుందన్నారు. తిరిగి ఈ రైలు (07098) సోమవారం సాయంత్రం 5.50 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.30 గంటలకు తిరుపతి జంక్షన్ చేరుకుంటుందన్నారు. రేణిగుంట, రాజంపేట, కడప, యర్రగుంట్ల, తాడిపత్రి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, కృష్ణా, యాదగిరి, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి, బేగంపేట మీదుగా రైలు ప్రయాణం సాగిస్తుందన్నారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

15 మండలాల్లో వర్షం



అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో అక్కడక్కడా వర్షాలు పడ్డాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు 15 మండలాల పరిధిలో 6.3 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. వజ్రకరూరు 52 మి.మీ, తాడిపత్రి 31.4, పెద్దవడుగూరు 29.6, యాడికి 19.2, విడపనకల్లు 16.2, గుత్తి 11.4, పామిడి 10.8 మి.మీ వర్షపాతం నమోదు కాగా మిగతా మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. ఆగస్టు సాధారణ వర్షపాతం 88.3 మి.మీ కాగా 145 మి.మీ వర్షం పడింది. ఓవరాల్‌గా జూన్ 1 నుంచి 165 మి.మీ గానూ 38 శాతం అధికంగా 228 మి.మీ నమోదైంది. 14 వర్షపు రోజులు (రెయినీడేస్) నమోదయ్యాయి. 23 మండలాల్లో సాధారణం కన్నా అధికంగా, మరో 8 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

అనుమతులు లేకుండా ఎర్రమట్టి తరలిస్తే చర్యలు

- డీఎస్పీ వెంకటేశ్వర్లు

సాక్షి ఎఫెక్ట్..

గార్లదిన్నె: అనుమతులు లేకుండా ఎర్రమట్టి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. 'యథేచ్ఛగా ఎర్రమట్టి తవ్వకాలు' శీర్షికన శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. జంబులదిన్నె కొట్టాల వద్ద మట్టి తవ్వకాలు చేసిన ప్రభుత్వ గుట్టను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మైనింగ్ శాఖ నుంచి అనుమతులు ఉంటేనే మట్టి తరలించాలని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా, ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుండా మట్టిని ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అక్రమంగా ఎవరైనా మట్టి తరలిస్తే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. అనంతరం గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. మండలంలో క్రైమ్ రేట్ తగ్గించి, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఖాకీ కర్కశం.. చావే శరణ్యం!

- రామగిరి మండలంలోని ఏడుగుర్రాల పల్లిలో దళిత మైనర్ బాలికను 14 మంది సామూహిక అత్యాచారం చేశారు. బాలికకు ఐదోనెల గర్భం వచ్చాక పత్రికల ద్వారా బయటి ప్రపంచానికంత టికీ తెలిశాక గానీ పోలీసులు స్పందించలేదు. చివరకు అధికార పార్టీ నేతల ఒత్తిడితో నిందితులను కాపాడాలని శతవిధాలా యత్నించడం సర్వత్రా విమర్శలకు తావిచ్చింది.
- అనంతపురంలో రెండు నెలల క్రితం ఓ ఇంటర్ విద్యార్థిని దారుణ హత్యకు గురైంది. విద్యార్థిని కనిపించకుండా పోయిన రోజే తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించలేదు. ఇది జరిగిన రెండు రోజులకే యువతి శవమై కనిపించింది. టీడీపీకి చెందిన వ్యక్తి హత్య చేశాడు. ఈ క్రమంలోనే ఉన్నతాధికారులు సీఐని సస్పెండ్ చేశారు.
- ఇటీవల కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన ఇరవై రెండేళ్ల శ్రావణి తనను భర్త, అత్తమామలు వేధిస్తున్నారని సీఐ యువరాజుకు ఫిర్యాదు చేశారు. సీఐ ఈ ఫిర్యాదును పట్టించుకోక పోగా టీడీపీ నేతల ఒత్తిడితో భర్తకు మద్దతు పలికారు. దీంతో తీవ్ర మానసిక వేదనకు గురైన శ్రావణి ఇక తనకు న్యాయం జరగదని భావించి ఆత్మహత్య చేసుకుంది.
- తప్పుడు కేసులు పెట్టి రాయదుర్గం సీఐ జయానాయక్ వేధిస్తున్నారని రెండు వారాల క్రితం నాగిరెడ్డి అనే వ్యక్తి పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. తగిన స్పందన లేకపోవడంతో మానవ హక్కుల సంఘాన్ని ఆశ్రయించాడు. ఖాకీల కర్కశత్వానికి పైన చెప్పుకున్నవి మచ్చుకు కొన్ని ఉదాహరణలే. ఇలాంటివి నిత్యం ఉమ్మడి జిల్లాలో ఎక్కడో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి. తమకు న్యాయం చేస్తారని పోలీసుస్టేషన్లను ఆశ్రయిస్తున్న బాధితులకు ఒక్కోసారి మరణమే శరణమవుతోంది.



ఉమ్మడి అనంత జిల్లాలో ఆగని దారుణాలు

- మేల్కోని పోలీసులు
- బలవుతున్న అబలలు
- తాజాగా 'దుర్గం'లో వివాహిత బలవన్మరణం
- పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి ప్రభుత్వం వచ్చాక ఉమ్మడి అనంతపురం జిల్లాలో జరుగుతున్న అమానుష ఘటనలు సర్వత్రా చర్చనీయాంశమవుతున్నాయి. వరుస దారుణాలతో మహిళలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. అన్యాయం జరిగితే బాధితుల పక్షాన నిలబడాల్సిన పోలీసులు డబ్బుల కోసం, రాజకీయ ఒత్తిళ్లతో ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు చెప్పినట్టు చేస్తూ నిందితులకు కొమ్ముకాస్తున్నారు. అబలలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నా చీమకుట్టినట్టయినా లేకుండా వ్యవహరిస్తున్న ఉమ్మడి అనంత జిల్లా పోలీసులపై అన్ని వర్గాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఫిర్యాదులు ఇచ్చినా..

తాజాగా కళ్యాణదుర్గంలో జరిగిన వివాహిత బలవన్మరణం ఘటన అందరినీ నివ్వెరపరుస్తోంది. కనీస మానవత్వం మరచి వ్యవహరిస్తున్న పోలీసుల కర్కశత్వానికి ఇదొక నిదర్శనం. స్వయానా బాధితురాలు శ్రావణి తనను భర్త, అత్తమామలు వేధిస్తున్నారని ఫిర్యాదు ఇచ్చినా సీఐ తీసుకోలేదు. ఈ క్రమంలో నిందితులకే మద్దతు పలికి తన చావుకు పోలీసులు కారణమయ్యారని బాధితురాలు చెప్పడం అందరినీ కన్నీళ్లు పెట్టిస్తోంది. టీడీపీకి చెందిన ఇద్దరు నాయకులు కూడా తన మరణానికి కారణమని ఆమె సూసైడ్ నోట్(ఆడియో)లో పేర్కొన్నారు.

తొలి నుంచీ అంతే..

తప్పుడు కేసులు పెట్టి తనను వేధిస్తున్నారంటూ పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఇటీవలే నాగిరెడ్డి అనే వ్యక్తి రాయదుర్గం సీఐ జయానాయక్‌పై ఏకంగా మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేశాడు. దీన్ని బట్టి సదరు సీఐ ఏ స్థాయిలో అతడిని వేధించి ఉంటారో అంచనా వేయొచ్చు. ఇక కళ్యాణదుర్గం సీఐ యువరాజు తొలి నుంచీ టీడీపీ నాయకులకు తాబేదారులా వ్యవహరిస్తున్నారనే ముద్ర పడింది. ఆయన నిబద్ధతతో వ్యవహరించి ఉంటే శ్రావణి ఇచ్చిన లేఖను చదివి న్యాయం చేసే వారని, టీడీపీ నాయకులు తెరవెనుక ఉన్నారు కాబట్టే ఘోరం జరిగిందని పలువురు వాపోతున్నారు.

అందని అంగన్‌వాడీ సరుకులు



లబ్ధిదారులకు పంపిణీ చేసే సరుకులు

తాడిపత్రి రూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని చాలా అంగన్‌వాడీ కేంద్రాల్లో గుడ్లు, ఇతర సరుకుల పంపిణీ నిలిచిపోయింది. ప్రతి నెలా మొదటి వారంలోనే పంపిణీ కావాల్సిన సరుకులు ఈ సారి రెండో వారం దాటినా లబ్ధిదారులకు అందించలేదు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో 3.20 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రతి నెలా మూడు కిలోల బియ్యం ప్యాకెట్లు, కిలో కంది బేడలు, అర కిలో ఆయిల్, 25 కోడిగుడ్లు, తల్లులకు 5, చిన్నారులకు 2.5 లీటర్ల పాలు పంపిణీ చేస్తారు. ఇప్పటికే కేంద్రాలకు ఆగస్టు మొదటి వారం మొదటి విడతగా సరుకులు వచ్చి చేరాయి. అంగన్‌వాడీలకు ప్రభుత్వం అందించిన సెల్‌ఫోన్ యాప్‌లలో వివరాల నమోదు ఆధారంగా సరుకులు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు, యాప్‌ల భారం తదితర కారణాలతో ఈ నెల 5న ఉమ్మడి జిల్లాలో చాలామంది అంగన్‌వాడీ కార్యకర్తలు సెల్‌ఫోన్లను ఉన్నతాధికారులకు వెనక్కు ఇచ్చేశారు. దీంతో లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేయలేదు. కొన్ని చోట్ల రికార్డుల్లో సంతకాలు పెట్టించుకొని లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు తెలిసింది.

పట్టని అధికారులు..

లబ్ధిదారులకు సరుకులు అందకున్నా ఐసీడీఎస్ అధికారులు పట్టించుకోకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. అధికారుల ఆదేశాల కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం రెండు విడతలకు సంబంధించి లక్షల్లో గుడ్లు నిల్వ ఉన్నాయి. ఇవి చెడిపోకముందే పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

సీఎం సీట్లో కూర్చునే అర్హత ఉందా బాబూ?

- స్వాతంత్ర్య దినోత్సవం రోజున మద్యం పాలసీపై మాట్లాడతావా?
- 'దుర్గం'లో గర్భిణి మృతిపై నిష్పాక్షికంగా విచారణ చేయాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: 'సూపర్‌సిక్స్ పథకాల ద్వారా మొదటి ఏడాదిలో ప్రజలకివ్వాల్సిన రూ.80 వేల కోట్లు ఎగురగొట్టావు. మద్యం పాలసీ ముసుగులో ఆదాయాన్ని పెంచుకునే పనిలో ప్రజాప్రతినిధులు నిమగ్నమయ్యారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజునైనా మద్యాన్ని కట్టడి చేయడంపై చంద్రబాబు మాట్లాడతారని ప్రజలంతా భావించారు. ఆ విషయాన్ని పక్కన పెట్టి మద్యాన్ని నాణ్యతగా, సరసమైన ధరలకు అందిస్తామని చెప్పడం సిగ్గుచేటు. నోరు తెరిస్తే పచ్చి అబద్ధాలు మాట్లాడే బాబూ.. నీకు సీఎం సీట్లో కూర్చునే అర్హత ఉందా' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం నగరంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఎం చంద్రబాబు తీరుపై 'అనంత' నిప్పులు చెరిగారు. ఐఏఎస్, ఐపీఎస్‌లు ప్రజాప్రతినిధుల చేతుల్లో కీలుబొమ్మలు కావడంతో దౌర్జన్యాలు, మహిళలపై అఘాయిత్యాలు పెచ్చుమీరాయన్నారు. మద్యం గురించి ప్రస్తావించి యువతకు చంద్రబాబు ఎలాంటి సందేశమిస్తున్నారని ప్రశ్నించారు. 'ఆడబిడ్డ నిధి', 'నిరుద్యోగ భృతి', 50 ఏళ్లకు పైబడి వారికి పింఛన్ ఇవ్వలేదన్నారు. ఉచిత బస్సుకు సంబంధించి కేవలం 7 రకాల సర్వీసుల్లో మహిళలకు అవకాశం కల్పించారని, పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణ తరహాలో అమలు చేయలేదని దుయ్యబట్టారు.

రైతన్నకు అడుగడుగునా అన్యాయం..

'అన్నదాత సుఖీభవ' పథకం కింద ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని చెప్పి రైతాంగాన్ని చంద్రబాబు వంచించారన్నారు. గత ప్రభుత్వంలో విత్తనం నుంచి విక్రయం వరకు రైతులకు మేలు చేసేలా అప్పటి సీఎం వైఎస్ జగన్ చర్యలు తీసుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 2024–25లో ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. క్రాప్ ఇన్సూరెన్స్‌కు సంబంధించి 86 లక్షల ఎకరాల్లో ప్రీమియం చెల్లించాల్సి ఉంటే ఇప్పటి వరకు 14 లక్షల ఎకరాలకు మాత్రమే రైతులు చెల్లించారని చెప్పారు.అతివృష్టి, అనావృష్టి కారణంగా వేరుశనగ, పత్తి, ఆముదం, కందులు వేసుకునే పరిస్థితి లేదని, కనీసం రైతులను ఆదుకునేలా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం లేదని వాపోయారు. రైతుల పట్ల కూటమి ప్రజాప్రతినిధులు, అధికారులు చిన్నచూపు వైఖరి ప్రదర్శిస్తుండడం అన్యాయమన్నారు. యూరియా, డీఏపీ తదితర ఎరువులు డిస్ట్రిబ్యూటర్ నుంచి ఎక్కడకు వెళ్తున్నాయో నిఘా ఉంచాలని, బస్తాపై అదనంగా రూ.50–రూ.100 వరకూ రైతుల నుంచి వసూలు చేస్తున్నారని, వీటిని అరికట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని తాము కలెక్టర్‌కు విన్నవించినా పట్టించుకోలేదన్నారు.

శ్రావణి మృతిపై విచారణ చేయాలి...

జిల్లా కేంద్రంలో విద్యార్థి తన్మయి హత్యతో పాటు ఉమ్మడి జిల్లాలో మహిళలు, మైనర్లపై అఘాయిత్యాలు జరిగినా పోలీసు వ్యవస్థ ఏమాత్రం మేలుకోలేదని విమర్శించారు. తన్మయి విషయంలో ఆందోళన చేస్తే సీఐను సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారన్నారు. ఇలాంటి ఉదాసీనత కారణంగానే తాజాగా కళ్యాణదుర్గంలో గర్భిణీ శ్రావణి ఆత్మహత్యకు పాల్పడిందని ఆరోపించారు. భర్త, అత్తామామలు, పోలీసులు, టీడీపీ నాయకులు తనను ఇబ్బందులకు గురి చేశారని, వారి కారణంగానే ఆత్మహత్య చేసుకుంటానని ఓ నిండు గర్భిణీ చెప్పడం కలచివేస్తోందన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ జగదీష్‌ను కలిసి తాము విన్నవిస్తే కళ్యాణదుర్గం పోలీసులే విచారణ చేస్తారని చెప్పడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఓ యువ ఐపీఎస్ ఇటువంటి సమాధానం చెబుతారా అని ప్రశ్నించారు. కళ్యాణదుర్గం పోలీసుల కారణంగా ఇబ్బంది పడినట్లు గర్భిణీ చెప్పిందని గుర్తు చేశారు. ఈ విషయంలో నిష్పాక్షికంగా విచారణ చేయాలని, లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

గోకుల కృష్ణా..



ప్రత్యేక అలంకరణలో రాధాపార్థసారథి



విద్యుద్దీపాలంకరణలో అనంతపురంలోని ఇస్కాన్ మందిరం

జిల్లాలో శనివారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు సందడిగా జరిగాయి. చిన్నికృష్ణులు, గోపికమ్మలు ఆకట్టుకున్నారు. తమ పిల్లలను తల్లిదండ్రులు అందంగా ముస్తాబు చేసి మురిసిపోయారు. పలు గ్రామాల్లో కృష్ణ పరమాత్ముడి విగ్రహాల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఉట్లోత్సవాలు సందడిగా సాగాయి. కృష్ణాష్టమిని పురస్కరించుకుని అనంతపురంలోని ఇస్కాన్ మందిరం కిటకిటలాడింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



భక్తులతో కిటకిటలాడుతున్న ఇస్కాన్ మందిర పరిసరాలు

బస్సులు కటకట.. లోపల కిటకిట



అనంతపురం ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులోకి ఎక్కేందుకు పోటీ పడుతున్న మహిళలు



సీట్ల కోసం పురుషుల ఆరాటం

- కిక్కిరిసిన ఆర్టీసీ బస్సులు
- సర్వీసులు పెంచకపోవడంపై డ్రైవర్లలో ఆందోళన

అనంతపురం క్రైం: మహిళలతో ఆర్టీసీ బస్సులు కిక్కిరిశాయి. ప్రయాణికులతో ఆర్టీసీ బస్టాండ్లు కిటకిటలాడాయి. బస్సుల్లో పరిమితి భారీగా పెరిగిపోయింది. దీంతో డ్రైవర్లు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రాయదుర్గం నుంచి శనివారం మధ్యాహ్నం అనంతపురం వచ్చిన ఓ ఆర్టీసీ బస్సులో 118 మంది ప్రయాణికులు ఎక్కారు. ఓవరు లోడు కావడంతో సురక్షితంగా బస్సును తీసుకురావడానికి తలప్రాణం తోకకొచ్చినట్లయిందని బస్సు డ్రైవర్ ఆవేదన వ్యక్తం చేశారు. టైరు పేలినా ప్రాణాలు గాలిలో కలసిపోతాయని వాపోయారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాల్సిన అవసరం చాలా ఉందని తెలిపారు. లేకుంటే ఉన్న ఆర్టీసీ బస్సులన్నింటినీ భవిష్యత్‌లో గుజిరీకి వేయాల్సి ఉంటుందని చెప్పారు.

ప్రత్యేకంగా సీట్లు పెట్టండి..

అనంతపురంలో ఓ వృద్ధుడు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో 'పురుషులకు మాత్రమే' సీట్లు పెట్టించాలని కోరడం గమనార్హం. కనీసం బస్సుకు పది సీట్లైనా కేటాయించాలని ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశాడు. లేకుంటే డబ్బిచ్చి కూడా సీటు లేకుండా నిలబడి ప్రయాణించాల్సిన పరిస్థితి ఉందని వాపోయారు.



అనంతపురం-కళ్యాణదుర్గం బస్సులో అంతర్రాష్ట్ర సర్వీసు అని ఏర్పాటు చేసిన దృశ్యం

వాటిలో వర్తించదంట..

జిల్లాకు కర్ణాటక సరిహద్దుగా ఉండటంతో ఆయా ప్రాంతాలకు ఆర్టీసీ పల్లె వెలుగు బస్సుల్లో కూడా ఉచిత ప్రయాణానికి అనుమతించకపోవడం గమనార్హం. ప్రధానంగా జిల్లాలోని గుంతకల్లు-బళ్లారి, రాయదుర్గం- బళ్లారి, కణేకల్లు- బళ్లారి, కంబదూరు- పావగడ, పేరూరు-పావగడ, బళ్లారి- డీ హీరేహాళ్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు స్వగ్రామమైన గుమ్మఘట్ట, బొమ్మనహాళ్, ఉరవకొండ నుంచి రూపనగూడి, చీకలగుర్కి నుంచి బళ్లారికి వెళ్లే పల్లె వెలుగు బస్సుల్లో ఈ సమస్య బాగా కనిపిస్తోంది. దీంతో మహిళలు ఇంకెందుకు 'స్త్రీ శక్తి' అంటూ వాపోతున్నారు.

ఏఆర్ ఎస్‌ఐ నాగేంద్రకు సేవా పతకం



సేవా పతకం అందుకుంటున్న ఏఆర్ ఎస్‌ఐ నాగేంద్ర

అనంతపురం: ఏఆర్ ఎస్‌ఐ కురుబ నాగేంద్రకు సేవా పతకం లభించింది. ఇప్పటికే ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్న ఆయన్ను సేవా పతకానికి ఈసారి రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. అనంతపురంలోని పోలీస్ ట్రెనింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ వాసుదేవన్ నుంచి నాగేంద్ర సేవా పతకాన్ని అందుకున్నారు. కళ్యాణదుర్గం మండలం మల్లాపురానికి చెందిన నాగేంద్ర 1990లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. 36 ఏళ్లుగా క్రమశిక్షణ, చిత్తశుద్ధితో పని చేస్తున్నారు. సేవా పతకం అందుకున్న నాగేంద్రకు ఏఆర్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

క్లుప్తంగా

అనంతపురం, కర్నూలు జట్ల విజయం



చంద్రిక (3 వికెట్లు) శిరీష (94 పరుగులు)

అనంతపురం: అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్ జోన్ సీనియర్ (ఉమెన్) అంతర జిల్లా టోర్నీలో అనంతపురం, కర్నూలు జట్లు విజయం సాధించాయి. వివరాలిలా ఉన్నాయి. అనంతపురం, నెల్లూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత నెల్లూరు జట్టు బ్యాటింగ్ చేసింది. 38.5 ఓవర్లలో 112 పరుగులు సాధించి ఆలౌట్ అయింది. చంద్రిక మూడు వికెట్లు తీసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు 17.4 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే నష్టపోయి 114 పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేదించింది. బి.నేహా 60 బంతుల్లో 56 పరుగుల (10 ఫోర్లు)తో నాటౌట్‌గా నిలిచింది. ఎస్.ఆశ్రియ 46 బంతుల్లో 45 పరుగులు చేసింది. వీరిద్దరి భాగస్వామ్యం గెలుపునకు బాటలు వేసింది. ఫలితంగా అనంతపురం జట్టు 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

- కడప – కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కడప జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. కడప జట్టు 49.3 ఓవర్లలో 194 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఎ.శిరీష 97 బంతుల్లో 94 పరుగులు (11 ఫోర్లు) ఒంటరి పోరాటం చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు ఐదు వికెట్లు నష్టపోయిన 196 పరుగులు చేసి విజయం సాధించింది. ఎం.అనూష 34 బంతుల్లో (9 ఫోర్లు) 51 పరుగులు, ఎస్వీ కుషల్యబాయి 98 బంతుల్లో 70 పరుగులు (12 ఫోర్లు) కీలక భాగస్వామ్యం నెలకొల్పారు.

రైలు పట్టాలపై మృతదేహం

అనంతపురం సిటీ: అనంతపురం రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటంపల్లి – ఖాదర్‌పేట మార్గమధ్యంలో గుర్తు తెలియని వ్యక్తి(40) మృతదేహాన్ని శనివారం ఉదయం కనుగొన్నట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం రాత్రి బాగా పొద్దు పోయిన తరువాత మృతుడు రైలు కింద పడి మరణించి ఉంటాడని భావిస్తున్నామన్నారు.

అభాగ్యులకు అమ్మ భరోసా

- విద్య, వైద్య సాయంతో పాటు కుటుంబాలకు చేయూత
- పాతికేళ్లు దాటిన 'అమ్మ' స్వచ్ఛంద సంస్థ సేవా ప్రస్థానం


కృత్రిమ కాలు, ఆర్థికసాయం అందిస్తున్న తరిమెల రమణారెడ్డి

తల్లిదండ్రులను కోల్పోయిన అనాథలు.. ప్రతిభ ఉండి ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత విద్య అభ్యసించలేకపోతున్న పేదలను చూస్తే ఆయన హృదయం కరిగిపోతుంది. ఊహించని ప్రమాదాలు.. అనారోగ్యాల బారినపడి వైద్యం చేయించుకోలేని స్థితిలో ఇబ్బంది పడుతున్న వారి గురించి తెలిస్తే చలించిపోతారు. పేదరికంతో కుటుంబాన్ని పోషించలేక పిల్లలను పస్తులుంచుతున్న దృశ్యాలు ఆయన్ను కదిలిస్తాయి. ఇలా ఎందరో అభాగ్యులను 'అమ్మ'లా అక్కున చేర్చుకుని చేతనైన సహాయం చేస్తున్నారు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి. ఆయన స్థాపించిన 'అమ్మ' సంస్థ సామాజిక సేవలో 25 వసంతాలు పూర్తి చేసుకుంది. అభాగ్యుల జీవితాలకు భరోసా కల్పిస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న రమణారెడ్డి జీవితం ఎందరికో ఆదర్శం.


గుండె ఆపరేషన్ల కోసం చెక్కులు అందజేస్తున్న 'అమ్మ' సంస్థ వ్యవస్థాపకుడు తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: కళ్యాణ దుర్గం నియోజకవర్గం శెట్టూరు మండలం కదిరిదేవరపల్లికి చెందిన ఆంజనేయులు, పుల్లమ్మ దంపతులు. వారి ముగ్గురు పిల్లలూ గుండె జబ్బుతో బాధపడుతున్నారు. అందరికీ ఆపరేషన్లు అయితే తప్ప బతకడం సాధ్యం కాదని వైద్యులు తేల్చేశారు. అయితే వారికి అంతటి ఆర్థిక స్థితి లేదు. ఎక్కడా వారికి భరోసా కూడా దక్కలేదు. విషయం తెలిసిన 'అమ్మ' స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు తరిమెల రమణారెడ్డి ముందుకొచ్చారు. ఆపరేషన్లకు అవసరమైన రూ.8 లక్షలు అందించి వారికి పునర్జన్మ ప్రసాదించారు. సాటి మనిషికి సేవ చేయడంలో ఉన్న సంతృప్తి ఆయన్ను ముందుకు నడిపిస్తోంది.

'అమ్మ' సంస్థకు అంకురార్పణ ఇలా..

రెండున్నర దశాబ్దాల కిందట ఆగస్టులో స్వాతంత్య్ర వేడుకలు సాగుతున్న వేళ అనంతపురానికి చెందిన తరిమెల రమణారెడ్డి స్నేహితురాలు ప్రమాదానికి గురైంది. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఆమెకు ఆయనే రక్తదానం చేసి బతికించుకున్నారు. ఆ సందర్భంలో వారి కృతజ్ఞత, అవసరానికి ఆదుకునే మనుషుల అవసరాన్ని గుర్తించిన తరిమెల రమణారెడ్డి అనురాగానికి మారుపేరైన 'అమ్మ' పేరుతోనే ఓ స్వచ్ఛంద సంస్థ ప్రారంభించారు. తన సంపాదనలోనే కొంత భాగాన్ని సామాజిక సేవకు వినియోగిస్తున్నారు. తల్లిదండ్రులు కోల్పోయిన వారి గురించి, ప్రతిభ ఉండి ఉన్నత విద్య నభ్యసించలేకపోతున్న వారి గురించి తెలిసినా.. తన దృష్టికి వచ్చినా అలాంటి వారిని అక్కున చేర్చుకుని.. వారికి అవసరమైన సహాయ సహకారాలందించి వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనాథలు, నిస్సహాయ స్థితిలోని 65 మంది పేదింటి పిల్లల ఉన్నత విద్యకు, పేదరికంతో బాధపడుతున్న 220 మందికి నిత్యావసర సరుకులతో పాటు ఆర్థికంగా చేయూతనిచ్చారు. పలువురికి స్వయం ఉపాధి కల్పించి గౌరవంగా బతికేలా చేయూతనందించారు. ఇక 142 మందికి వైద్యసాయం అందించి మానవత్వం చాటుకున్నారు.

సామాజిక సేవకు ముందుకు రావాలి

లోకంలో స్వార్థం పెరిగిపోతోంది. సొంత బంధువులకు కూడా సాయపడలేని స్థితికి వస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో సాటి మనిషికి సాయం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. ధనవంతులు, స్థితిమంతులు మానవతాదృక్పథంతో తమ సంపాదనలో కొంత సమాజానికి కేటాయించగలిగితే ఎంతోమంది అభాగ్యుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చు. నాకు సేవ చేసుకునే భాగ్యం కల్పించింది మా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులే. నాకు ప్రసాదరెడ్డి, స్వరాజ్యలక్ష్మి దంపతులు జన్మనిస్తే, రంగనాయకమ్మ, కుళ్లాయిరెడ్డి దంపతులు మరో జీవితం ప్రసాదించారు. భార్య లక్ష్మి, కొడుకు సాయి సిద్ధార్థరెడ్డి ప్రోత్సాహంతో నేను 'అమ్మ' సంస్థ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలను విజయవంతంగా నడపగలుగుతున్నాను.

– తరిమెల రమణారెడ్డి, వ్యవస్థాపకుడు, అమ్మ సంస్థ

'అనంత' యువకుడికి రాష్ట్రపతి ప్రశంసలు

అనంతపురం కల్చరల్: 'వన్ నేషన్ – వన్ ఎలక్షన్' అనే అంశంపై చర్చించడానికి అనంతపురం జిల్లా నుంచి పుట్లూరు మండలం కందికాపుల గ్రామానికి చెందిన బిసాతి భరత్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అవకాశం కల్పించారు. ఈ మేరకు శనివారం ఆయన ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతిని కలిసి దేశవ్యాప్తంగా ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడానికి తగిన సూచనలతో కూడిన వినతిపత్రం అందించారు. సంవిధాన్ సపోర్ట్ గ్రూప్ ద్వారా ఇప్పటికే భారత ప్రతిభావంతుల బృందంలో ఉన్న బిసాతి భరత్ జాతీయ యువజన అవార్డు గ్రహీతలైన శివకుమార్, సుదీష్‌పారీఖ్, నిహారిక, పల్వబ్ బిస్వాస్ తదితరులతో కలిసి ముర్ముతో చర్చించారు. తమ బృందం జాతీయ సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై 320 మంది ఎంపీలను కలిసిందని, లక్షలాది మందితో సంతకాల సేకరణ చేసిందని వివరించారు. మద్యపాన, మాదకద్రవ్యాల ప్రభావాన్ని ఎన్నికల సమయంలో నియంత్రించేందుకు వీలైన మార్గాలను బృందం సభ్యులు తెలియజేశారు. సంవిధాన్ బృందం చేస్తున్న కృషిని రాష్ట్రపతి ప్రశంసిస్తూ ప్రత్యేకంగా అభినందించారు.


రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసిన బిసాతి భరత్

జిల్లా వ్యాప్తంగా కార్డెన్ సెర్చ్


సోదాలు చేస్తున్న పోలీసులు

అనంతపురం: జిల్లా వ్యాప్తంగా పోలీసులు కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించారు. పలు సమస్యాత్మక గ్రామాలు, కాలనీల్లో శనివారం తెల్లవారుజాము నుంచి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. పుట్ పెట్రోలింగ్, గ్రామస్తులతో సమావేశాలు నిర్వహించారు. గంజాయితో కలిగే అనర్థాలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, మహిళలపై నేరాలు, శక్తి యాప్, డయల్-100, సీసీ కెమెరాల ప్రాముఖ్యత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, అనుమానితులు, పాత కేసుల్లోని నిందితులపై ప్రత్యేక నిఘా వేసి ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. పాత కేసుల్లోని నిందితులతో సమావేశమై.. పాత పంథా కొనసాగించకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు.

గంజాయి ముఠా అరెస్ట్


గంజాయి ముఠాను అరెస్ట్ చూపుతున్న సీఐ శివగంగాధర్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: గంజాయి ముఠాను తాడిపత్రి పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 610 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ శివగంగాధర్ రెడ్డి పోలీస్ స్టేషన్‌లో మీడియాకు వెల్లడించారు. ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరికి వచ్చిన సమాచారం మేరకు రూరల్ పోలీసులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది, వ్యవసాయాధికారులతో కలిసి స్థానిక చుక్కలూరు రోడ్డులో అనుమానాస్పదనంగా ఉన్న ఇద్దరు (ఓ వ్యక్తి- మైనర్ బాలుడు) వ్యక్తులను తనిఖీ చేయగా.. వారి వద్ద డ్రై గంజాయి లభించింది. దీంతో కర్నూలు జిల్లా ఆత్మకూరు చెందిన శేషాద్రిని అరెస్టు చేసి.. 16 సంవత్సరాల బాలుడిని జువైనల్ కోర్టులో హాజరుపరిచారు. వీరు ఒడిశాలో గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి పలు ప్రాంతాల్లో ఎక్కువ ధరకు అమ్ముకుంటూ వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తూ జీవిస్తున్నారు. ఇప్పటి వరకు వీరు తాడిపత్రి శివారు, నందలపాడు వంటి ప్రాంతాల్లో మూడుసార్లు గంజాయి విక్రయించినట్లు విచారణలో తేలిందని సీఐ తెలిపారు.

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న బీడీ, సిగార్ కార్మిక సంఘం రాష్ట్ర కన్వీనర్ ఓబులు

అనంతపురం అర్బన్: బీడీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఏపీ బీడీ, సిగార్ కార్మికుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జి.ఓబులు డిమాండ్ చేశారు. ఇందుకోసం అక్టోబరు నుంచి నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. శనివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో సంఘం రాష్ట్ర కో-కన్వీనర్ పి.ఇక్బాల్‌బాషా అధ్యక్షతన రాష్ట్ర సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వేల కుటుంబాలు బీడీలు చుట్టడం, కట్టలు కట్టడం వంటి పనులు చేస్తున్నాయన్నారు. నిరంతరం పనులు చేస్తున్న కారణంగా క్షయ, వెన్నునొప్పి, ఇతర జబ్బులకు గురవుతున్నారని తెలిపారు. వీరికి వైద్యం అందించేందుకు ఈఎస్ఐ ఆస్పత్రుల్లో మందులు, వైద్య సిబ్బంది లేకపోవడం బాధాకరమన్నారు. కార్మికులకు తక్కువ వేతనాలు ఇస్తూ కంపెనీలు పెద్దఎత్తున లబ్ధి పొందుతున్నాయన్నారు. బీడీ ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం 28 శాతం జీఎస్టీ వసూలు చేస్తోందని, అయితే కార్మికుల సంక్షేమాన్ని మాత్రం పట్టించుకోవడం లేదని అన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు ఇచ్చి ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు అబ్దుల్ దేశాయ్, సుధాకర్, జీఎల్ నరసింహులు, జగన్, ఉమాగౌడ్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం


ఆవిర్భావ వేడుకల్లో ఏపీజీఏ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం (ఏపీజీఏ) లక్ష్యం అని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపీకృష్ణ, రాము నాయక్ పేర్కొన్నారు. శనివారం అనంతపురంలోని సంఘం కార్యాలయంలో ఏడవ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఉద్యోగుల్లో నెలకొన్న అభద్రతాభావాన్ని సంఘం ద్వారా తొలగించేందుకు కృషి చేశామన్నారు. ఉద్యోగుల హక్కుల సాధనలో రాజీపడే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఉద్యోగవర్గాలకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు దాదాపు రూ. వేల కోట్ల ఆర్థిక బకాయిలున్నాయన్నారు. పెన్షనర్ల పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. సీపీఎస్, గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సమస్యలు ఇంతవరకూ పరిష్కారం కాలేదన్నారు. పెండింగ్ బకాయిలపై ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం మహిళా విభాగం సాంబశివమ్మ, సుజాత, నగర కమిటీ శ్రీనివాసులు, సుధాకర్, మౌలాసాబ్, నాగరాజు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

యాడికి కానిస్టేబుల్‌కు 'చంద్రబోస్ ఐకాన్' అవార్డు

- ఉత్తమ పోలీస్ అవార్డు సైతం..


మంత్రి కేశవ్ నుంచి ఉత్తమ పోలీసు అవార్డు అందుకుంటున్న విష్ణు భగవాన్

యాడికి: అరుదైన పురాతన నాణేలు సేకరిస్తున్న వారిని ప్రోత్సహించేలా ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్ రాజ్‌కు చెందిన జీవన జాగృతి ఆర్గనైజేషన్ పురాతన నాణేల పరిశోధన సంస్థ అంద జేస్తున్న 'సుభాష్ చంద్ర బోస్ ఐకాన్' అవార్డుకు యాడికి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ విష్ణు భగవాన్ ఎంపికయ్యారు. ఏటా ప్రయాగ్‌రాజ్‌కు చెందిన జీవన్ జాగృతి ఆర్గనైజేషన్ వారు తమ సంస్థ తరఫున అవార్డును అందజేస్తుంటారు. ఈ ఏడాది ఎంపికైన వారిలో తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటిసారి విష్ణు భగవాన్ ఎంపిక కావడం గమనార్హం. ఈ మేరకు గురువారం ఆ సంస్థ నుంచి విష్ణు భగవాన్‌కు సందేశం అందింది. కానీ తాడిపత్రిలో ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి ద్వారా నిర్వహిస్తున్న స్పెషల్ టీమ్‌లో విధులు నిర్వహిస్తుండటంతో ఉత్తమ పోలీసు అవార్డు రావటంతో అనంతపురంలో శుక్రవారం జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో మంత్రి పయ్యావుల కేశవ్ చేతుల మీదుగా ఎస్పీ జగదీష్ సమక్షంలో 'ఉత్తమ పోలీస్' అవార్డు అందుకున్నారు. దీంతో విష్ణుభగవాన్ ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో జరిగే అవార్డు కార్యక్రమానికి హాజరుకాలేనని వారికి సమాచారం అందజేశారు. దీంతో ఆ సంస్థ వారు పోస్టల్ ద్వారా అవార్డును చేరవేస్తామని విష్ణు భగవాన్‌కు తెలిపారు. అనంతపురంలో ఉత్తమ పోలీసు అవార్డు అందుకోవడం, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం తరఫున 'సుభాష్ చంద్రబోస్ ఐకాన్' అవార్డు పొందిన యాడికి కానిస్టేబుల్ విష్ణు భగవాన్‌ను ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి, యాడికి సీఐ ఈరన్న, ఎస్ఐ రమణ, పోలీసు సిబ్బంది శనివారం అభినందించారు.

కసాపురం.. భక్తజనసంద్రం

- నెట్టికంటుడి నామస్మరణతో మార్మోగిన ఆలయ పురవీధులు


గరుడ వాహనంపై సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్ల ఊరేగింపు

గుంతకల్లు రూరల్: శ్రావణ మాసం నాలుగో శనివారం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం భక్తులతో పోటెత్తింది. స్వామి నామస్మరణతో ఆలయ పురవీధులు మార్మోగాయి. వేకువజామునే అభిషేకాలు నిర్వహించిన అర్చకులు స్వామివారిని స్వర్ణ కవచ అలంకరణలో తీర్చిదిద్ది ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. జిల్లాతో పాటు తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అధికారులు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి దర్శనం కల్పించారు. సాయంత్రం సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్లను గరుడ వాహనంపై కొలువుదీర్చి ఈఓ ఎం.విజయరాజు, ఆలయ అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గరుడ వాహనంపై స్వామివార్లను ఊరేగిస్తూ ఆలయం చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించారు.

'పల్లె'కు అధికారుల జీ హుజూర్!

- కలెక్టరేట్‌లో టీడీపీ నేతలతో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సమీక్ష
- ఏకంగా కలెక్టర్ కుర్చీలో కూర్చున్న వైనం
- అడ్డు చెప్పని కలెక్టరేట్ అధికారులు


కలెక్టరేట్‌లో టీడీపీ కార్యకర్తలతో మాజీ మంత్రి పల్లె సమీక్ష (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి

ప్రశాంతి నిలయం: ఆయనేమీ ప్రజాప్రతినిధి కాదు. తెలుగుదేశం పార్టీ నేత. అయినా అధికారిక కార్యక్రమాల్లో అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. ఎవరు ఏమనుకుంటే నాకేంటి..? అధికారం మాది.. ఏం చేసినా చెల్లుబాటు అవుతుందనే ధోరణితో ముందుకు సాగుతున్నారు. పార్టీ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించే స్థాయి నుంచి ఇప్పుడు ఏకంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ సీటులోనే కూర్చుని టీడీపీ నాయకులతో సమీక్ష నిర్వహించారు. అధికారులు కూడా ఆయనకు అడ్డు చెప్పకుండా 'జీ హుజూర్' అంటూ మిన్నకుండిపోవడం గమనార్హం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసే కార్యక్రమాల్లో ఎలాంటి అధికారిక హోదా లేకపోయినప్పటికీ పాల్గొంటున్నారు. ఇంతటితో ఆగకుండా ఏకంగా అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నారు. తాజాగా శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఆయన టీడీపీ నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఏకంగా కలెక్టర్ కుర్చీలో ఆశీనుడై పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఇంత జరుగుతున్నా కలెక్టరేట్ అధికారులు అడ్డుచెప్పకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కలెక్టరేట్‌ను పార్టీ కార్యాలయంగా మార్చేస్తూ సమావేశం నిర్వహించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

ఎమ్మెల్యే ఉన్నా.. అన్నీ తానై..

మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కోడలు సింధూర రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నా ఆయనే అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. అధికారుల బదిలీలు, నియామకాలు, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు.. ఇలా ఏ కార్యక్రమమైనా ఆయనే ముందుంటున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు సైతం ఎమ్మెల్యేకు బదులు తానే హాజరవుతున్నారు. ఈ విషయంలో ప్రజల నుంచి విమర్శలు వచ్చినా లెక్క చేయడం లేదు. తన కోడలికి ఏమీ తెలియదని, అందుకే తాను ముందుండి నడిపిస్తున్నానని చెప్పుకుంటున్నారు.

అప్రమత్తంగా వ్యవహరించాలి

- భద్రత చర్యలు ముమ్మరం చేయాలి
- రైల్వే జీఎం సంజయ్‌కుమార్


కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న రైల్వే జీఎం శ్రీ వాస్తవ్

గుంతకల్లు: ప్రస్తుత రుతుపవనాలను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగులు అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు భద్రతా చర్యలు ముమ్మరం చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ్ ఆదేశించారు. శనివారం జోనల్ పరిధిలోని గుంతకల్లు, విజయవాడ, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల డీఆర్‌ఎం, ఏడీఆర్‌ఎం, డివిజన్ స్థాయి ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే జీఎం మాట్లాడుతూ వర్షాకాలంలో ముంపునకు ఎక్కువగా గురయ్యే వంతెనలు, సొరంగాలు, రోడ్డు అండర్ బ్రిడ్జిలు వంటి ప్రదేశాల్లో జాగ్రత్తలు పాటించాలన్నారు. అక్కడ ఇసుక, బ్యాలస్ట్, సిమెంట్, బండరాళ్లు, పైపులు అందుబాటులో ఉన్నాయా? లేదా పరిశీలించుకోవాలన్నారు. స్టేషన్ యార్డుల్లో డ్రెయినేజీ వ్యవస్థ, పంపింగ్, సున్నితమైన ప్రదేశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా నిఘా పెట్టాలన్నారు. అంతేకాకుండా పెరిగిన చెట్ల వల్ల కలిగే ప్రమాదాన్ని గుర్తించి తొలగించాలన్నారు. విపత్తు నిర్వహణ గదిని తనిఖీలు చేయడంతో పాటు 24 గంటలూ పర్యవేక్షణ చేయాలన్నారు. అవరోధాలు ఎదురైన సమయాల్లో ప్రయాణికులకు కచ్చితమైన సమాచారం అందించడానికి ప్రధాన రైల్వేస్టేషన్లలో హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏ సమస్యనైనా వెంటనే పరిష్కరించేలా చూసుకోవాలన్నారు. ప్రయాణికుల భద్రత, కార్యాచరణ నైపుణ్యం పట్ల మీ నిబద్ధతను చాటి ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఎం చంద్రశేఖర్‌గుప్తా, ఏడీఆర్‌ఎం సుధాకర్, డివిజన్ స్థాయి ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

గర్భిణి ఆత్మహత్య కేసులో నిందితుల అరెస్ట్

కళ్యాణదుర్గం రూరల్: మెట్టినింటి వారి వేధింపుల ఘటనలో పోలీసులు సరైన న్యాయం చేయలేదని సెల్ ఫోన్‌లో ఆడియో వాయిస్ రికార్డ్ చేసి ఆత్మహత్య చేసుకున్న నిండుగర్భిణి శ్రావణి కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాసులు, కళ్యాణదుర్గం పట్టణ సీఐ యువరాజ్ శనివారం మీడియాకు వెల్లడించారు. కళ్యాణదుర్గానికి చెందిన బోయ శ్రావణి భర్త, అత్త, మామలు వేధింపులకు గురిచేస్తున్నారని ఇదివరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పెద్దల పంచాయితీలోనూ న్యాయం జరగకపోవడంతో రెండు రోజుల కిందట శ్రావణి దొడగట్ట రోడ్డులోని తన పుట్టింటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు కారకులైన భర్త శ్రీనివాసులు, మామ శీనప్ప, అత్త కరియమ్మను శనివారం పట్టణంలోని కంబదూరు రోడ్డు వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు.

క్లుప్తంగా

పూజల్లో పాల్గొన్న జిల్లా స్పెషల్ కోర్టు జడ్జి


పూజల్లో పాల్గొన్న స్పెషల్ జడ్జి శివశంకర్

ఆత్మకూరు: పంపనూరు గ్రామంలోని సర్ప రూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం జిల్లా స్పెషల్ కోర్టు జడ్జి శివశంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటగా కొండపై ఉన్న మలహోబిలేశ్వరుని స్వామి వారికి పూజలు చేపట్టారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ బాబు, ఆలయ సిబ్బంది జడ్జికి శాలువా కప్పి తీర్థ ప్రసాదాలను అందించారు.

ఆలయాల వద్ద పటిష్ట బందోబస్తు


డ్రోన్ నిఘాలో అనంతపురంలోని ఇస్కాన్ మందిరం

అనంతపురం: శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రముఖ ఆలయాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. తోపులాటలు లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేయించి దర్శనాలు సాఫీగా జరిగేలా ఆయా ఆలయాల అధికారులు, కమిటీల సభ్యులతో కలిసి పోలీసులు విధులు నిర్వర్తించారు. అనంతపురం ఇస్కాన్ మందిరంతో పాటు జిల్లాలోని ముఖ్య దేవాలయాల పరిసరాలలో ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా, చోరీలు, ఈవ్‌టీజింగ్‌లకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

ఉత్తమ సేవలకు అవార్డులు


మంత్రి కేశవ్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న సమాచార శాఖ పీఆర్‌ఓ సూర్యనారాయణరెడ్డి


టైపిస్ట్ దామోదర్‌రెడ్డి,


ఫొటోగ్రాఫర్ కోటప్ప


కిరణ్ బాబు

అనంతపురం అర్బన్: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన సమాచార, పౌర సంబంధాల శాఖ ఉద్యోగులకు అవార్డులు లభించాయి. ఈనెల 15న నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చేతులు మీదుగా పీఆర్‌ఓ సూర్యనారాయణరెడ్డి, టైపిస్ట్ దామోదర్‌రెడ్డి, ఫొటోగ్రాఫర్లు కోటప్ప, కిరణ్‌బాబు ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

25న రాష్ట్రస్థాయి మహాధర్నా


పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57ను డీఎస్సీ–2003 టీచర్లకు అమలు చేయాలని డీఎస్సీ–2003 టీచర్ల ఫోరం రాష్ట్ర కన్వీనర్ కె.మధుప్రసాద్ డిమాండ్ చేశారు. మెమో 57 అమలు కోసం పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఈనెల 25న విజయవాడలో చేపట్టే రాష్ట్రస్థాయి మహాధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్లను శనివారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మధుప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2004 సెప్టెంబర్ 1 ముందే ఉపాధ్యాయ నియామక ప్రక్రియ పూర్తయి ప్రభుత్వ విధానాల వలన పోస్టింగ్ ఆలస్యమైందన్నారు. ఈ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం వర్తింపచేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్సీ–2003 టీచర్ల ఫోరం నాయకులు మారుతీప్రసాద్, నాగభూషణ, సాయినాథరెడ్డి, వరదరాజులు, ఎర్రిస్వామి, సుదర్శనరెడ్డి, రామకృష్ణ, రాజేష్, అది, నాగేంద్ర , రఘుపతి, రాము, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తాడిపత్రిటౌన్: పట్టణంలోని పెన్నా బ్రిడ్జి సమీపంలోని సపోట తోటలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. వారి వద్ద నుంచి రూ 1.02 లక్షల నగదు స్వాధీనం చేసుకుని, మూడు ద్విచక్రవాహనాలను సీజ్ చేశామని చెప్పారు.


గోపికాకృష్ణుల వేషధారణలో ఆకట్టుకుంటున్న చిన్నారులు


భావసార క్షత్రియ మహిళా మండలి ఆధ్వర్యంలో వేడుకలు


లలిత కళాపరిషత్తులో సాంస్కృతిక నృత్య ప్రదర్శన

అంబరం.. కృష్ణాష్టమి సంబరం


నృత్యం చేస్తున్న బాలిక


అనంతపురంలోని ఇస్కాన్ మందిరం వద్ద భక్తుల సందడి


ఎల్కేపీ వద్ద ఉట్టి కొడుతున్న దృశ్యం

అనంతపురం కల్చరల్/అనంతపురం కార్పొరేషన్/అనంతపురం రూరల్: శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు శనివారం నగర మంతటా వైభవోపేతంగా జరిగాయి. ఇస్కాన్ మందిరంలో గీతాచార్యుడైన శ్రీకృష్ణ పరమాత్ముని దివ్యమంగళ రూపాన్ని దర్శించుకోవడానికి భక్తులు పోటీ పడ్డారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు కనుల పండువగా సాగుతూ భక్తిభావాన్ని పెంచాయి. ఇస్కాన్ జిల్లా ఇన్‌చార్జ్ దామోదర గౌరంగదాసు నేతృత్వంలో రాత్రి ఉట్టి ఉత్సవం,మహాపుష్పాభిషేకం నేత్రపర్వంగా సాగింది. గీతామందిరం, వేణుగోపాలస్వామి ఆలయం, పాతూరు చెన్నకేశవస్వామి ఆలయం తదితర చోట్ల చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఉదయం గీతా పారాయణం, విష్ణుసహస్ర నామ పారాయణం, పల్లకీ సేవ, మహామంగళ హారతి, అభిషేకాలు,తీర్థప్రసాద వినియోగం జరిగాయి. అరవిందనగర్‌లోని శ్రీకృష్ణమందిరం భక్తజన సంద్రంగా మారింది. శ్రీకృష్ణుడిని సర్వాంగ సుందరంగా అలంకరించి చిన్నారి కృష్ణవేషధారులతో పూజలు జరిపించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి, కమిటీ అధ్యక్షురాలు మీరా, బత్తలపల్లి సత్యరంగారావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దాండియా..

భవసార క్షత్రియ సమాజ్ వారి ఆధ్వర్యంలో రామనగర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు సంబరంగా సాగాయి. వందలాది మంది చిన్నారులు కృష్ణవేషధారులుగా, గోపికలుగా ముచ్చటగొలుపుతూ రేపల్లెను తలపించారు. ప్రత్యేకంగా మరాఠీ సంస్కృతి ఉట్టిపడేవిధంగా దాండియా (ఉట్టకొట్టు ఉత్సవం)లో చిన్నారులు సందడి చేశారు. శ్రీరుక్మిణీ పాండురంగ విఠలుడు విశేష అలంకార సేవల్లో పూజలందుకున్నాడు. అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు తీర్థప్రసాదాలందుకున్నారు. అలాగే సాయిట్రస్టు ఆధ్వర్యంలో లలితకళాపరిషత్తులో సాయిగోకులం వేడుకలు నయనానందకరంగా సాగాయి. శ్రీనృత్యకళానిలయం నాట్యాచార్యులు సంధ్యామూర్తి శిష్యబృందం కృష్ణాష్టమి పాటలపై శాస్త్రీయ నృత్యాలు, ఉట్టి ఉత్సవం ఆకట్టుకున్నాయి. అనంతరం ట్రస్టు అధ్యక్షుడు విజయ్‌కుమార్ చేతుల మీదుగా చిన్నారులకు బహుమతులందించారు.

శిల్పారామంలో..

కృష్ణాష్టమిని పురస్కరించుకొని శిల్పారామంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు సందడిగా సాగాయి. అనంతపురం గ్రీన్ ఆర్మీ, శక్తి శారీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు శ్రీకృష్ణుని వేషధారణలో మైమరపించారు. శిల్పారామం ఏఓ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నగర ప్రజలకు వినోదాన్ని, ఉల్లాసాన్ని అందించడమే తమ లక్ష్యమన్నారు.

భక్తిశ్రద్ధలతో వేడుకలు

రాప్తాడు: మండలంలోని ప్రతి గ్రామంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రాప్తాడులోని స్థానిక శ్రీకృష్ణుని ఆలయం, లక్ష్మీ పండమేటీ రాయుడు స్వామి, ఉమా నీలకంఠేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, మారేమ్మ, పెద్దమ్మ, చిన్మయనగర్‌లోని వెంకటేశ్వరస్వామి, శివాలయం, హంపాపురంలోని 39 అడుగుల అభయాంజనేయ స్వామి, మారురులో చిన్నకదిరయ్యస్వామి, అయ్యవారిపల్లిలో ఎర్రితాత స్వామి, పుల్లలరేవు, యర్రగుంట గ్రామాల్లోని చెన్నకేశవస్వామి ఆలయాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో శ్రీ కృష్ణుని చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో చిన్నారులు శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. గ్రామాల్లో సాయంత్రం ఎద్దులబండ్లపై శ్రీ కృష్ణున్ని విగ్రహాన్ని ఊరేగించారు.

ఆత్మకూరు: మండలంలోని తలుపూరు, ముట్టాల గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీ కృష్ణుడి విగ్రహాలకు పూజలు చేపట్టారు. చాలా మంది తమ చిన్నారులకు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలు వేయించి మురిసిపోయారు. తలుపూరు గ్రామంలో రాష్ట్ర స్థాయి భజన పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.20 వేలు బహుమతిగా అందజేశారు.


కృష్ణాష్టమి సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న బాలలు


ఇస్కాన్ మందిరం వద్ద ఉట్లోత్సవం


శిల్పారామంలో..








నగరంలో పలు చోట్ల చిన్ని కృష్ణులు, గోపికమ్మల వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు

చిరస్మరణీయుడు గౌతు లచ్చన్న


గౌతు లచ్చన్న చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించిన చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ


గౌతు లచ్చన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

అనంతపురం సిటీ: మహనీయుడు, స్వాతంత్య్ర సమరయోధుడు సర్దార్ డాక్టర్ గౌతు లచ్చన్న చిరస్మరణీయుడని ఉభయ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ కొనియాడారు. అనంతపురంలోని జిల్లా పరిషత్ సమావేశ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన గౌతు లచ్చన్న 116వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి సర్దార్ గౌతు లచ్చన్న చేసిన త్యాగం, పోరాటాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. చిన్న వయసులోనే స్వాతంత్య్రోద్యమంలో చేరి మహాత్మాగాంధీ నాయకత్వంలో ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం, ఇతర పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నట్లు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఈఓ, డిప్యూటీ సీఈఓ డుమ్మా

గౌతు లచ్చన్న జయంతికి జెడ్పీ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య డుమ్మా కొట్టడం చర్చనీయాంశమైంది. ఒకరు కర్నూలు, మరొకరు అన్నమయ్య జిల్లాలో నివాసం ఉండడంతో కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. ప్రభుత్వం గౌతు లచ్చన్న జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని అధికారికంగా ప్రకటించిన నేపథ్యంలో ముందుండి నడిపించాల్సిన ముఖ్య అధికారులు ఎవరిదారిన వారు వెళ్లిపోవడం జెడ్పీ ఉద్యోగుల్లో హాట్ టాపిక్‌గా మారింది.

ఆదర్శప్రాయుడు..

అనంతపురం అర్బన్: సమాజం కోసం శ్రమించిన డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయుడని వక్తలు అన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో గౌతు లచ్చన్న జయంతి నిర్వహించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్‌ఓ ఎ.మలోల ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వల్లభాయ్ పటేల్ తరువాత సర్దార్ అనే గౌరవం పొందిన ఏకైన వ్యక్తి గౌతు లచ్చన్న అని అన్నారు. స్వాతంత్య్రం రాక ముందే సమాజం కోసం, ప్రజల హక్కుల కోసం పోరాడారన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో బాలికల నృత్యప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి ఖుష్బూకొఠారి, బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రమణ్యం, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

అంతటా శ్రావణ శోభ

అనంతపురం కల్చరల్: నగరంలోని వైష్ణవాలయాలు శ్రావణమాస శోభతో అలరారాయి. రామనగర్, హౌసింగు బోర్డు, ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాలలో ఏడు శనివారాల వ్రతాలు కనుల పండువగా జరిగాయి. ఆలయాలలోని నాగులకట్టల వద్ద భక్తులు పాలు పోసి నాగదేవతలను పూజించుకున్నారు.

లడ్డూ పడి పూజలు..

శివబాలయోగి ఆశ్రమంలో శ్రావణమాసోత్సవాలలో భాగంగా వివిధ రకాల ప్రసాదాలతో లడ్డూ పడి పూజలు ఘనంగా జరిగాయి. పెద్ద ఎత్తున భక్తాదులు తరలి వచ్చి స్వామివారి విశేష పూజల్లో పాల్గొన్నారు. ఉదయం వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకం, తులసి అర్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మందిర ప్రతినిధులు విశ్వనాథ్, అరవింద్, రత్నగిరి దేవరాజ్ తదితరులు వందలాది మందికి ప్రసాద వితరణ గావించారు.

నాగుల కట్టలకు పూజలు

రాప్తాడు: శ్రావణ మాసం నాలుగో శనివారం సందర్భంగా భక్తులు నాగుల కట్టలు, పుట్టలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాప్తాడులో ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయం, లక్ష్మీ పండమేటి రాయుడు ఆలయం, షిర్డీసాయిబాబా ఆలయ ప్రాంగణంలోని నాగుల దేవతల విగ్రహాలతో పాటు మండలంలో గ్రామ గ్రామానా నాగుల చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఉదయాన్నే ఉపవాసాలతో పుట్టకు పసుపు కుంకుమలు, తోరణాలు (పసుపు పూసిన పచ్చిదారాలు) అలంకరించి పాలుపోసి చలివిడి ముద్దలు, నువ్వుల ముద్దలు ప్రసాదంగా ఉంచారు. కుటుంబాలు చల్లగా ఉండాలంటే నాగ దేవతలను కోరుకున్నారు.


చిన్మయనగర్‌లో పుట్టకు పూజలు చేస్తున్న మహిళలు

ప్రభుత్వాలు నిర్లక్ష్యం వీడాలి

- రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున


మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున

అనంతపురం అర్బన్: మూడు రాష్ట్రాల ప్రజలకు తాగు, సాగునీరు అందించే తుంగభద్ర డ్యాం గేట్ల మరమ్మతు చేపట్టడంలో కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నాయని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి చిరుతల మల్లికార్జున మండిపడ్డారు. సాధ్యం కాని బానకచర్ల, పోలవరం అనుసంధానంపై దృష్టి పెట్టే ముఖ్యమంత్రి చంద్రబాబు టీబీ డ్యాం గేట్ల మరమ్మతుపై దృష్టి పెడితే బాగుంటుందన్నారు. శనివారం స్థానిక సంఘం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాల పర్యవేక్షణ లోపం కారణంగా గత ఏడాది టీడీ డ్యాం గేటు దెబ్బతిందన్నారు. కన్నయ్యనాయుడు వంటి ఇంజనీర్ల సలహాతో సకాలంలో గేటు మరమ్మతు చేశారన్నారు. ఈ ఏడాది మరో ఎనిమిది గేట్లు దెబ్బతిన్నట్లు సమాచారం ఉందన్నారు. డ్యాంలో 103 టీఎంసీలు నిల్వ చేయాల్సి ఉంటే ప్రస్తుత పరిస్థితుల్లో 80 టీఎంసీలు మాత్రమే నిల్వ చేసే అవకాశం ఉందని ఇంజినీర్లు చెబుతున్నారన్నారు. 1953లో ఏర్పాటు చేసిన డ్యాం గేట్లు ఇప్పటికీ మార్చకపోవడమే ఈ పరిస్థితికి కారణమన్నారు. ఇప్పటికైనా మూడు ప్రభుత్వాలు సమన్వయం చేసుకుని నిధులు వెచ్చించి గేట్లను మార్చాలని డిమాండ్ చేశారు.

'అవకతవకలకు ఆస్కారం లేదు'

అనంతపురం కల్చరల్: నగరంలోని చెరువుకట్టపై వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో ఎటువంటి అవకతవకలు, అక్రమాలు జరగడం లేదని కమిటీ అధ్యక్షుడు బుట్నా మణికంఠ అన్నారు. ఈ మేరకు శనివారం ఆలయ ప్రాంగణంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేవలం రాజకీయ దురుద్దేశాలతోనే ఆరోపణలు చేశారన్నారు. ఆలయ నిధుల విషయంలో జమా ఖర్చులు, ప్రతి ఏటా ఆడిటింగ్, ఇన్‌కమ్‌టాక్స్ వివరాలను రిజిస్ట్రార్ ఆఫీసులో సమర్పిస్తున్నామన్నారు. ఆలయ నిర్మాణం జరిగిన తొలిరోజుల్లో పూర్తి సహకారమందించిన కేరళ సమాజం వారి సూచనలు, సలహాలతోనే ఆలయం అభివృద్ధి చెందుతోందన్నారు. గతంలో జరిగిన వివిధ అభివృద్ధి పనులను వివరించారు. రాజకీయ దురుద్దేశాలను ఆలయాలకు ఆపాదించవద్దని విజ్ఞప్తి చేశారు. అధికార పార్టీకి చెందిన రంగాచారి అనే వ్యక్తి కావాల్సిన వారికి మాత్రమే ఇరుముడులు కడతారని బీదల గురించి ఆలోచిస్తే నిందలు వేస్తారని విచారం వ్యక్తం చేశారు. ఆలయ రక్షణ కోసం కేరళ సమాజం వారు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నందకుమార్, వీరాంజనేయులు, వెంకటనారాయణ, ప్రవీణ్‌నాయర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటివైద్య శిబిరం


కంటివైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

అనంతపురం అర్బన్: ఐ మిత్ర విజన్ సెంటర్ సౌజన్యంతో సీపీఎం నగర కమిటీ శనివారం స్థానిక రంగస్వామి నగర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించింది. శిబిరాన్ని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, ఐమిత్ర విజన్ వ్యవస్థాపకులు పులిపాటి గోపాల్, కో–ఆర్డినేటర్ నాగరాజు ప్రారంభించారు. హాజరైన ప్రజలకు నాగరాజు, ఇతర సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి శుక్లాలతో బాధపడేవారికి ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని ఐ మిత్ర విజన్ నిర్వాహకులు తెలిపారు. కళ్ల సంరక్షణకు ఆహారంలో నిత్యం ఆకుకూరలు, కూరగాయలు ఉండేలా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. నిత్యం యోగ, వ్యాయామం అవసరమని చెప్పారు. ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు, సిబ్బందికి ఈ సందర్భంగా రామిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో 47వ డివిజన్ కార్పొరేటర్ రామచంద్ర, సీపీఎం నాయకులు వెంకటనారాయణ, రాజు, గఫూర్, జీవా, రాముడు, ముసలప్ప, వీరన్న, పెద్దబేబీ, వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు జీపును ఢీకొన్న ఆర్టీసీ బస్సు



గుత్తి: పోలీసు జీపును ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటన గుత్తిలో చోటు చేసుకుంది. శనివారం సీఐ వెంకటేశ్వర్లు పోలీసు సిబ్బందితో కలిసి గాంధీ సర్కిల్ వద్దకు జీపులో చేరుకున్నారు. రోడ్డు పక్కన జీపు పార్క్ చేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నారు. అదే సమయంలో అటుగా వచ్చిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ యూటర్న్ తీసుకునే క్రమంలో జీపును ఢీకొన్నాడు. జీపు పాక్షికంగా దెబ్బతింది. జీపులో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయ్యింది.